సాక్షి సూర్యాపేట

సోమవారం। 20। ఫిబ్రవరి। 2023



వైభవంగా లక్ష బిల్వార్చన

యాదాద్రి కొండపైన రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. - 8లో



వైఎస్సార్‌టీపీ పటిష్టతకు కృషి

వైఎస్సార్ టీపీ పటిష్టతకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్ట రాంరెడ్డి అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం 35°/17°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది రాత్రి చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సూర్యక్షేత్రంలో మహాసౌరహోమం



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం మహా సౌరహోమాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయస మేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, కర్నాటి నాగేశ్వరరావు, గణపురం నరేష్, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల ఉద్యమానికి సహకరించాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట): ప్రైవేట్ రంగంలోనూ ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ చేపడుతున్న న్యాయబద్ధమైన ఉద్యమానికి బీఆర్‌ఎస్ పార్టీ సహకరించాలని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తలమళ్ల హస్సేన్ కోరారు. ఈ మేరకు ఆదివారం సూర్యాపేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా హస్సేన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాజ్యాంగపరంగా అనుమతులు తీసుకొని నడిపిస్తున్న ప్రైవేట్‌రంగ పరిశ్రమల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వినయ్, బంజారాసేవా సమితి రాష్ట్ర నాయకులు పాండు నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్, మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నామా వేణు, ప్రధాన కార్యదర్శి గాజుల నరసయ్య, గౌరవ అధ్యక్షుడు గోలి సాంబయ్య, బోయిల అఖిల్ పాల్గొన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య పూజలు విశేషంగా కొనసాగాయి. అనంతరం సహస్రనామార్చన, తులసీ దళాలతో అర్చించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు విశేషంగా జరిపించారు. ముఖ మండపంలో పుష్పార్చన, ప్రథమ ప్రాకారమండపంలో వేద ఆశీర్వచనం పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

టెన్త్ ఇంటర్నల్స్‌పై ఆరా

రేపటి నుంచి పాఠశాలల్లో తనిఖీలు

- జిల్లా వ్యాప్తంగా 34 బృందాల పర్యటన
- 23వ తేదీ వరకు కొనసాగనున్న ప్రక్రియ
- మొత్తం 355 స్కూళ్లు.. 12,219 మంది విద్యార్థులు



చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

మూడు రోజుల్లో తనిఖీలు పూర్తి చేస్తాం



టెన్త్ ఇంటర్నల్ మార్కులకు సంబంధించి ఇప్పటికే పరిశీలన బృందాలను ఏర్పాటు చేశాం. ఈ బృందాలు పాఠశాలలకు వెళ్లి నిబంధనల మేరకు విద్యార్థుల అసైన్‌మెంట్ మార్కులు, రికార్డులను పరిశీలిస్తాయి. మూడు రోజుల్లో తనిఖీలు పూర్తి చేస్తాం.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

చిలుకూరు: ఏప్రిల్ మొదటి వారంలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఇంటర్నల్ మార్కుల నమోదుపై ఆరా తీసేందుకు జిల్లా విద్యాశాఖ సిద్ధమైంది. కరోనా తర్వాత పూర్తి స్థాయిలో పాఠశాలలు నడవడంతో ఈ మార్కుల నమోదుపై ఎస్ఎస్‌సీ బోర్డు ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలు అంచనా వేసేందుకు క్షేత్ర స్థాయిలో పరిశీలన జరపాలని రాష్ట్ర విద్యాశాఖ పరీక్షల విభాగాన్ని ఆదేశించింది. ఇంటర్నల్ మార్కుల నమోదు విషయంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా మార్కులు వేస్తారనే ఆరోపణలు వస్తుండడంతో మార్కులు, రికార్డులను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను నియమించింది. ఈ బృందాలు జిల్లాలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో మూడు రోజుల పాటుల పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించనున్నాయి.

వాస్తవాల పరిశీలనకే..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఫార్మెటివ్ పరీక్షల్లో వాస్తవ మార్కులు వేశారా.. లేదా ఇష్టానుసారంగా నమోదు చేశారా అన్న విషయాన్ని ఈ బృందాలు పరిశీలించనున్నాయి. వివిధ అంశాలను చూసి, లోపాలుంటే వాటిని సరిచేసిన తర్వాతే ఇంటర్నల్ మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రతి సజెక్టుకు 100 మార్కులు ఉండగా 80 మార్కులకు వార్షిక పరీక్షలు రాయాల్సి ఉంటుంది. మిగిలిన 20 మార్కులకు సీసీఈ విధానంలో నాలుగు ఫార్మెటివ్ అసైన్‌మెంట్ పరీక్షల ఫలితాలు, విద్యార్థులు రాసే రికార్డుల ఆధారంగా మార్కుల కేటాయింపు ఉంటుంది. పదో తరగతి విద్యార్థుల భవిష్యత్‌కు ఈ మార్కులు కీలకంగా మారిన నేపథ్యంలో ఈ తనిఖీలకు ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యార్థులు చేసిన ప్రాజెక్టు వర్క్స్, చేతి రాత, ఎఫ్ఏల్లో వచ్చిన మార్కులను ఈ బృందాలు సూక్ష్మంగా పరిశీలించనున్నాయి.

ఒక్కో బృందానికి 7 స్కూళ్ల బాధ్యతలు

జిల్లాలో జెడ్పీ, ప్రభుత్వ 184, ప్రైవేట్ 121, కేజీబీవీ, గురుకుల పాఠశాలలు 50 ఉండగా మొత్తం 12,219 మంది పదో తరగతి విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల్లో ఇంటర్నల్ మార్కుల తనిఖీకి నియమించిన ఒక్కో బృందంలో జీహెచ్‌ఎం గాని, ఎఫ్‌ఏసీ ప్రధానోపాధ్యాయులు గాని, ఒక లాంగ్వేజ్ పండితుడు, మరో నాన్ లాంగ్వేజ్ ఉపాధ్యాయుడు, స్కూల్ అసిస్టెంట్ ఉంటారు. ఒక్కో బృందానికి 5 నుంచి 7 పాఠశాలల బాధ్యతలను అప్పగించారు. మార్చి 21నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు ఉన్నందున ఈ నెలలోనే తనిఖీలు పూర్తిచేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు ఇంటర్నల్ మార్కులను ఆన్‌లైన్ లో నయోదు చేసే ప్రక్రియ చేపడతారు.

బీఆర్‌ఎస్‌తో పెనుమార్పులు ఖాయం



కౌన్సిలర్ మడిపెల్లి విక్రమ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- కేసీఆర్ విజన్ చాలా గొప్పది
- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: బీఆర్‌ఎస్ పార్టీతో దేశంలో పెనుమార్పులు చోటు చేసుకోవడం ఖాయమని, కేసీఆర్ విజన్ చాలా గొప్పదని, అలాంటి విజన్ ఉన్న నాయకుడు దేశంలో ఏ పార్టీలోనూ లేడని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని కాంగ్రెస్‌ను వీడిన 34వ వార్డు కౌన్సిలర్ మడిపెల్లి విక్రమ్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ నుంచి వందలాది మంది బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 ముందు నిరంతరం విద్యుత్ కోతలతో అయోమయ పరిస్థితి ఉండేదన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. అప్పట్లో సాగుకు సరిపడా నీరు అందక వ్యవసాయానికి పెట్టుబడి లేక ఉన్న ఊరిని వదిలి పొట్టకూటి కోసం వలస వెళ్లిన పరిస్థితులను ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణలో రుణమాఫీ, నిరంతర విద్యుత్, పుష్కలంగా తాగు, సాగునీరు, వ్యవసాయానికి పెట్టుబడిగా రైతుబంధు అందిస్తున్నారన్నారు. నాడు దండగ అనుకున్న వ్యవసాయాన్ని నేడు పండుగలా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కరెంట్ లేక మోటర్లు పోయక పంటలు ఎండిపోతుంటే తెలంగాణలో 24గంటల ఉచిత విద్యుత్‌తో మోటర్లు నిండుగా పోస్తుంటే వ్యవసాయం పచ్చగా ఉందని, ఇలా సరిహద్దు రాష్ట్రాల ప్రజలు పోల్చుకుంటున్నారని తెలిపారు. అందుకే వారికి తెలంగాణ రాష్ట్రంలో మాదిరి పాలన కావాలని లేదంటే తమ ప్రాంతాన్ని తెలంగాణలో కలపమని వేడుకుంటున్నట్లు అక్కడి నాయకులే సమావేశాల్లో వివరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అభివృద్ధి నిరోధకులైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలో ఉండబట్టలేక బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

• మంత్రి పరామర్శ





భవనం మెట్లు కూలిన ప్రమాదంలో గాయపడి ఆదివారం రాత్రి సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భవిత జూనియర్ కళాశాల విద్యార్థులు





బెడ్‌లు సరిపడా లేక కిటికీకి సెలైన్ బాటిల్ పెట్టి విద్యార్థికి చికిత్స అందిస్తున్న దృశ్యం, విద్యార్థిని పరామర్శిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ బడుగుల తదితరులు

'బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నాం'

యాదగిరిగుట్ట: ఈ నెల 21 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు నిర్వహించనున్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈఓ గీతారెడ్డి అన్నారు. ఆదివారం తన చాంబర్‌లో ఆయా శాఖల అధికారులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 27న ఎదుర్కోలు, 28న శ్రీస్వామి వారి తిరు కల్యాణోత్సవం, మార్చి 1న రథోత్సవం వంటి ముఖ్యమైన ఘట్టాలు జరుగుతాయన్నారు. శ్రీస్వామి వారి కైంకర్యాల్లో పాల్గొనేందుకు పారాయణీకులకు, అలంకార స్వాములకు ఆహ్వానాలు పంపించామని వెల్లడించారు. స్థానిక పోలీస్, రెవెన్యూ అధికారులతో ఇప్పటికే మాట్లాడినట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

గోదావరి జలాల నిలిపివేత

అర్వపల్లి: వారబందీ విధానంలో జిల్లాకు విడుదలవుతున్న గోదావరి జలాలను ఆదివారం నీటిపారుదలశాఖ అధికారులు నిలిపివేశారు. కరీంనగర్‌లోని లోయర్‌మానేరు డ్యాం నుంచి రెండో దశకు నీటిని నిలిపివేయడంతో జిల్లాకు తాత్కాలికంగా ఆపామని ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ ఎం.సత్యనారాయణ, ఏఈఈ అమర్ తెలిపారు. నాలుగైదు రోజుల్లో తిరిగి వారబందీ విధానంలో నీటిని పునరుద్ధరించనున్నట్లు చెప్పారు. అయితే రైతుల పంటలకు అవసరమైన మేరకు నీటిని వదులుతున్నామని తెలిపారు. కాగా కొన్నిచోట్ల రైతులు కాలువల షట్టర్లు, తూములను ఇష్టం వచ్చినట్లు తెరుస్తున్నారని, అలా చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మట్టపల్లి క్షేత్రంలో నారసింహుడి కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, అష్టోత్తర సహస్ర నామ, కుంకుమార్చనలు చేపట్టారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవాన్ని జరిపి వేదమంత్రోచ్చరణల నడమ కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కోర్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తాం



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పోర్టు పోలియో జడ్జి రాధారాణి



కోదాడలో పాత కోర్టు స్థలాన్ని పరిశీలిస్తున్న జడ్జి రాధారాణి

- జిల్లా పోర్టు పోలియో, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి రాధారాణి

హుజూర్‌నగర్: కోర్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకుంటామని హైకోర్టు న్యాయమూర్తి, సూర్యాపేట జిల్లా పోర్టు పోలియో, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి డాక్టర్ రాధారాణి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ కోర్టును పరిశీలించారు. అనంతరం జడ్జీలు, న్యాయవాదులతో సమావేశమై మాట్లాడారు. కోర్టుల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి కోర్టులో నెలకొన్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మేళ్లచెరువు, చింతలపాలెం మండలాలు భౌతికంగా హుజూర్‌నగర్‌కు చాలా దగ్గరగా ఉంటాయని వాటిని ఈ కోర్టు పరిధిలోనే ఉంచాలని కోరారు. మండలాల పరిధిని మార్చే విషయంతోపాటు నూతన కోర్టుల ఏర్పాటుపై హుజూర్‌నగర్, కోదాడ బార్ అసోసియేషన్లు ఒకరిపై మరొకరు ఆరోపణ, ప్రత్యారోపణలు చేసుకోవడం తగదని, సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. తొలుత న్యాయమూర్తికి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం సబ్‌జైలును సందర్శించి ఖైదీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గౌతమ్ ప్రసాద్, సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాముల రామిరెడ్డి, జక్కుల నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు, ఏజీపీ ఉప్పల గోపాలకృష్ణమూర్తి, ఆర్డీఓ వెంకారెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి, సీఐ రామలింగారెడ్డి, ఎస్ఐ వెంకటరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

కోదాడఅర్బన్ : కోదాడ కోర్టుకు నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయడంతో పాటు కోర్టులో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా పోర్ట్ పోలియో, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి రాధారాణి హామీ ఇచ్చారు. సూర్యాపేట పోర్ట్ పోలియో జడ్జిగా నియామకమైన ఆమెను ఇటీవల కోదాడ బార్ అసోసియేషన్ సభ్యులు కలిసి కోదాడ కోర్టును సందర్శించాలని కోరారు. దీంతో ఆదివారం ఆమె కోదాడ కోర్టును సందర్శించారు. కోర్టు పరిసరాలు, పాత కోర్టు స్థలం, బార్ అసోసియేషన్ గది, న్యాయమూర్తుల నివాస భవనాల నిర్మాణానికి కేటాయించిన స్థలాలను పరిశీలించారు. ఈ క్రమంలో న్యాయవాదులు పలు సమస్యలను జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జడ్జి రాధారాణి స్పందించి మాట్లాడారు. అనంతరం జడ్జి రాధారాణిని బార్ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన జడ్జి గౌతమ్‌ప్రసాద్, కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌సుందర్, బార్ అధ్యక్ష, కార్యదర్శులు నాగార్జున, వెంకటేశ్వర్లు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విధుల్లో చేరిన యాదాద్రి ఆలయ ఈఓ గీతారెడ్డి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓ గీతారెడ్డి ఆదివారం తిరిగి విధుల్లో చేరారు. ఆస్ట్రేలియాలోని వివిధ ప్రాంతాల్లో యాదాద్రీశుడి కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు ఈఓ గీతారెడ్డి, అర్చక బృందంతో కలిసి ఈ నెల 1న వెళ్లారు. 18 రోజుల అనంతరం ఈఓ, అర్చక బృందం యాదాద్రికి చేరుకున్నారు. ఇప్పటి వరకు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓగా ఉన్న ఆర్‌జేసీ రామకృష్ణారావు తిరిగి దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయానికి వెళ్లారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



పిల్లలమర్రిలోని ఎరకేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం చేస్తున్న అర్చకులు

సూర్యాపేట రూరల్: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి ఎరకేశ్వరస్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణం కమనీయంగా జరిగింది. నామేశ్వర స్వామి దేవాలయం నుంచి ఉత్సవ విగ్రహాలను మహిళల కోలాటాల నడుమ ఎరకేశ్వరాలయం ఎదుట ఉన్న మండపానికి తీసుకొచ్చారు. అనంతరం ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని నిర్వహించి కల్యాణం జరిపించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జెర్రిపోతుల భిక్షం తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు దరఖాస్తుల స్వీకరణ

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఆదేశాలు జారీ కావడంతో ఆదివారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. తొలిరోజు 1442 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం దరఖాస్తు నమునాను ఇవ్వడంతో వార్డుల వారీగా కౌన్సిలర్లు జిరాక్స్ తీయించి దరఖాసులు పంపిణీ చేస్తున్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని వార్డు కౌన్సిలర్లు ప్రచారం చేస్తున్నారు. అయితే, వార్డుల్లో కౌన్సిలర్లతోపాటు.. ఇతర చోటా మోటా నాయకులు కూడా దరఖాస్తులు పంపిణీ చేస్తుండడ కనిపించింది.

వైభవంగా రుద్రుడికి లక్ష బిల్వార్చన



రథాన్ని లాగుతున్న ఆలయ అధికారులు, సిబ్బంది



రథోత్సవం ముందు పూజలు చేస్తున్న ఆచార్యులు

- రాత్రి స్వామి, అమ్మవార్లకు రథోత్సవం
- నేటితో పర్వతవర్ధినీ రామలింగేశ్వర ఆలయంలో ముగియనున్న శివరాత్రి ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం ఉప శివాలయంలో నిత్య హవనములు, శివ పంచాక్షరీ జపములు, నందీశ్వర పారాయణములు, పంచసూక్త పఠనం చేపట్టారు. మూలమంత్ర జపములు, వివిధ పారాయణములు పారాయణీకులచే గావింపజేశారు. అనంతరం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల సమయంలో ప్రధానాలయంలోని మహాశివుడికి లక్ష బిల్వార్చన పూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం నిత్య ఆరాధనల అనంతరం స్వామి, అమ్మవార్లకు రథోత్సవం నిర్వహించారు. రాత్రి ఆలయ మండపంలో రథోత్సవం నిర్వహిస్తున్న సమయంలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు.

నేటితో ఉత్సవాలు పరిసమాప్తం

మహాశివరాత్రి ఉత్సవాలు సోమవారం మధ్యాహ్నం పూర్ణాహుతి, రాత్రి డోలోత్సవంతో ముగియనున్నాయి. ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన శివరాత్రి ఉత్సవాలను స్మార్త ఆగమశాస్త్ర ప్రకారం ముగింపు పలికేందుకు పూజారులు సన్నాహాలు చేస్తున్నారు.

పట్టువస్త్రాలు అందజేత



ఈఓ గీతారెడ్డికి పట్టువస్త్రాలను అందజేస్తున్న దాతలు

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో స్వామి, అమ్మవార్లకు మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన చాట్లా ప్యాట్నీ సెంటర్ నిర్వాహకులు చాట్లా వెంకటేష్, పుష్ప, లక్ష్మీకాంత్, చంద్రకాంత్‌లు రూ.2లక్షల విలువైన 10 పట్టు చీరలు, 10 పట్టు పంచెలను ఆలయ ఈఓ గీతారెడ్డికి ఆదివారం అందజేశారు. గత 7సంవత్సరాలుగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు అందజేస్తున్నట్లు చాట్లా వెంకటేష్ తెలిపారు. అంతకుముందు పట్టువస్త్రాలకు ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వఙ్లోజు వెంకటేష్, పోటబత్తి హరిదాస్, ఎల్లప్ప గడ్డం, హరి పాశికంటి, శ్రీనివాస్ రాళ్లదొడ్డి, రాజామహేంద్ర కమటం తదితరులున్నారు.

ఛాయా సోమేశ్వరాలయంలో అగ్నిగుండాలు



ఛాయా సోమేశ్వర ఆలయంలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు, ఆలయ సిబ్బంది

రామగిరి(నల్లగొండ): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పానగల్లులోని ఛాయా సోమేశ్వరాలయం నందు ఆదివారం ఉదయం తెల్లవారుజామున పల్లకీ సేవ, అగ్నిగుండాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన పల్లకీలో ఆలయం చుట్టూ ఊరేగించారు. ఊరేగింపు తర్వాత బలి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆలవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండాల్లో భక్తులు నడిచి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, శివప్రసాద్, సోమశేఖర్, వెంకట్, తిరుమల్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, దశరథ, మధు, అర్చకులు అజయ్‌కుమార్, ఉదయ్‌కుమార్, శంకరయ్య, పరమయ్య, సోమయ్య, శివరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా తెప్పోత్సవం

పట్టణంలోని పానగల్లు ఛాయా సోమేశ్వరాలయం నందు శివరాత్రి సందర్భంగా ఆదివారం రాత్రి తెప్పోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ప్రత్యేక ఆభరణాలతో అలంకరించారు. పూలతో అలంకరించిన హంస వాహనంపై స్వామి, అమ్మవార్లకు ఆలయం ముందు ఉన్న కోనేరులో తెప్పోత్సవం, పవళింపు సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, తిరుమల్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, సోమశేఖర్, అర్చకులు అజయ్‌కుమార్, ఉదయ్‌కుమార్, శివప్రసాద్, వెంకట్, రుద్రసేన పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి..

తెప్పోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరి భక్తులను అలరించింది. హైదరాబాద్‌కు చెందిన మహా ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సంగీత విభావరిలో మహా ఆర్ట్స్ వ్యవస్థాపకురాలు ఇంజమూరి లక్ష్మి శిష్య బృందం మేఘన, శ్రీనివాస్, ప్రమోద్, దివ్య, అమూల్య సంగీతాలాపన చేశారు. జగన్మోహిని తబలా సహకారం అందించారు.





ఛాయా సోమేశ్వర ఆలయంలో అగ్నిగుండాల్లో నడుస్తూ మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

- నిందితుడి అరెస్టు



నిందితుడు మంగులాల్

మిర్యాలగూడ అర్బన్: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిని మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం సీఐ నిగిడాల సురేష్‌కుమార్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడం జిల్లా జూలూరుపాడు వినోభానగర్‌కు చెందిన భూక్య మంగులాల్ తాను రైల్వే డిపార్టుమెంట్‌లో ఉద్యోగం చేస్తున్నానని చెప్పి మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన భగవాన్ నాయక్ భార్య లీలకు ఆర్‌అండ్‌బీ శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.24 లక్షలు వసూలు చేశాడు. అనంతరం ఉద్యోగం వచ్చినట్లు ఒక అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీ, నకిలీ ఐడీకార్డు తయారుచేసి శర్మ అనే పేరుతో నకిలీ ఈమెయిల్ ద్వారా భగవాన్‌నాయక్‌కు పంపించి ఉద్యోగం ఇప్పించకుండా, డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన భగవాన్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం ఉదయం మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో మంగులాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. మొత్తం తొమ్మిది మంది బాధితుల నుంచి సుమారు రూ.70 లక్షలకు పైగా డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ సురేష్‌కుమార్‌తో పాటు ఎస్‌ఐ డి. వెంకటేశ్వర్లు, ఇతర పోలీసు సిబ్బందిని డీఎస్పీ పి. వెంకటగిరి ప్రత్యేకంగా అభినందించారు.

పుట్టినరోజు కేక్‌లో బూజు

- ఇద్దరికి అస్వస్థత



బూజు పట్టిన కేక్

చండూరు: మున్సిపాలిటీ కేంద్రంలోని పలు బేకరీల్లో నాసిరకమైన స్వీట్స్, కేక్‌లు అమ్ముతున్నారని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం పట్టణ కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి మున్సిపాలిటీ కేంద్రంలోని ఓ షాపులో పుట్టిన రోజుకు కేక్ కొనుగోలు చేశాడు. ఆ కేక్ తిన్న ఇద్దరికి వాంతులు అవ్వడంతో కేక్‌ను పరిశీలించగా అది బూజు పట్టి ఉండటం గమనించాడు. దీంతో కేక్ కొనుగోలు చేసిన బేకరీ నిర్వాహకులను నిలదీశాడు. అంతేకాకుండా అదే బేకరీలో మరో వ్యక్తి కొనుగోలు చేసిన కేక్ సైతం బూజు పట్టిందని షాపు యజమానిని నిలదీశాడు. బేకరీలు, షాపులల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు నిర్వహించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



సైదిరెడ్డి మృతదేహం

నకిరేకల్: అప్పుల బాధతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని తాటికల్ గ్రామ శివారులోని ఆర్లగడ్డగూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆర్లగడ్డగూడెంలో నివాసముంటున్న పరెడ్డి సైదిరెడ్డి(38) తనకున్న రెండెకరాల్లో పత్తి సాగు చేశాడు. ఇటీవల ట్రాక్టర్‌ను కూడా కొనుగోలు చేశాడు. పంట పెట్టుబడి కోసం, ట్రాక్టర్ కొనుగోలుకు అప్పులు చేశాడు. అయితే అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి వచ్చిన సైదిరెడ్డి మధ్యాహ్నం భార్య హారికతో కలిసి భోజనం చేశాడు. అనంతరం భార్య పశువుల కొట్టం వద్దకు వెళ్లింది. అదే సమయంలో సైదిరెడ్డి ఇంట్లోనే దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి భార్య ఇంటికి వచ్చేసరికి తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల వారిని పిలిచి తలుపు పగులగొట్టగా అప్పటికే సైదిరెడ్డి విగత జీవిగా కనిపించాడు. అప్పుల బాధతోనే తన ఆత్మహత్య చేసుకున్నాడని భార్య హారిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

- పిల్లలమర్రి శివాలయం వద్దకు వెళ్లి వస్తుండగా ఘటన



గుగులోత్ పవన్ (ఫైల్)

ఆత్మకూర్-ఎస్(సూర్యాపేట): రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన శనివారం రాత్రి మండల పరిధిలోని బోరింగ్ తండా సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్త తండాకు చెందిన గుగులోతు హరిసింగ్, బీబీలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వీరి చిన్న కుమారుడు గుగులోత్ పవన్(24) ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం సూర్యాపేట మండలంలోని పిల్లలమర్రి శివాలయం వద్దకు బైక్‌పై వెళ్లి రాత్రి తిరిగి ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యలో నూతనకల్ నుంచి సూర్యాపేట వైపునకు వెళుతున్న లారీ అతివేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న పవన్ బైకును ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న హెడ్‌కానిస్టేబుల్ దానియల్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి హరిసింగ్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



భిక్షం మృతదేహం

రామగిరి (నల్లగొండ): కారు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం తిప్పర్తి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం చెర్వుపల్లి గ్రామానికి చెందిన తళ్లమళ్ల భిక్షం(60), అతడి భార్య పూలమ్మ ఆదివారం తిప్పర్తి మండల కేంద్రంలోని నిర్మలామాత చర్చికి ప్రార్థన చేసేందుకు వచ్చారు. చర్చిలో ప్రార్థన ముగించుకొని చర్చి ఎదురుగా ఉన్న తమ బంధువు వల్లీ రాజశేఖర్ ఇంటి దగ్గరికి వెళ్లారు. ఇంటి ముందు రోడ్డుపై రాజశేఖర్, దేవిరెడ్డి శోభ, దాసోజు సైదాచారితో మాట్లాడుతుండగా.. మిర్యాలగూడ వైపు నుంచి అతివేగంగా వస్తున్న ఎక్స్‌యూవీ వాహనం వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తళ్లమళ్ల భిక్షం అక్కడికక్కడే మృతిచెందగా.. పూలమ్మ, సైదాచారిలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువు వల్కీ రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వాస ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం



ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న రామకృష్ణారెడ్డి

మోత్కూరు: ఆయిల్‌పామ్ సాగు లాభదాయకమని, రైతులు సాగుపై ఆసక్తి పెంచుకోవాలని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మోత్కూరు మండలంలోని అనాజీపురం గ్రామంలో పంజాల రామకృష్ణ రైతు వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలను ఆయన నాటారు. ఈ సందర్భంగా రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు వివిధ రకాల ప్రోత్సాహకాలను అందజేస్తుందని పేర్కొన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు గోరుపల్లి శారదసంతోష్‌రెడ్డి, సర్పంచ్ ఉప్పల లక్ష్మియాదయ్య తదితరులు ఉన్నారు.

మంటలు అంటుకొని దుకాణం దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

తిరుమలగిరి (తుంగతుర్తి): మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీ సమీపంలో గల పాత ఇనుప సామాను దుకాణం ఆదివారం మంటలు అంటుకుని దగ్ధమయ్యింది. కాలనీ సమీపంలోని సమాధుల పక్కన ఎండిన కంపకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పక్కనే ఉన్న పాత ఇనుప సామాను, ప్లాస్టిక్ సామాన్లకు మంటలు అంటుకున్నాయి. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు మంటలను అదుపు చేశారు. చుట్టుపక్కల ఇళ్ల వారు భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల మధ్యన పాత ఇనుప సామాను దుకాణాలను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నిజాయితీ చాటుకున్న యువకులు



బాధితులకు ఎస్‌ఐ సమక్షంలో వెండి ఆభరణాలు అప్పగిస్తున్న యువకులు

మునుగోడు: రోడ్డుపై దొరికిన వెండి ఆభరణాలను పోగొట్టుకున్న వారికి తిరిగి ఇచ్చి నిజాయితీ చాటుకున్నారు ఇద్దరు యువకులు. వివరాలు.. మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందినా ఎంపీ శర్మ భార్యకు చెందిన 40 తులాల వెండి ఆభరణాలు కల్వకుంట్ల గ్రామానికి వెళ్లే దారిలో కిందపడిపోగా అదే గ్రామానికి చెందిన బిజన్ కుమార్, కృష్ణ అనే యువకులకు శనివారం దొరికాయి. వాటిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయగా శర్మ కుటుంబ సభ్యులు గమనించి ఆ యువకుల వద్దకు వచ్చారు. దీంతో ఆదివారం మునుగోడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వాటిని ఎస్‌ఐ సతీష్‌రెడ్డి సమక్షంలో శర్మ దంపతులకు అందించారు. దొరికిన వస్తువులను నిజాయితీగా బాధితులకు అప్పగించడంతో ఇద్దరు యువకులను ఎస్‌ఐ ప్రత్యేకంగా అభినందించారు.

కళాశాలపై చర్యలు తీసుకోవాలి

సూర్యాపేటటౌన్: విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న సూర్యాపేట పట్టణంలోని భవిత జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు వీరబోయిన లింగయ్య యాదవ్, భారి అశోక్, బాషపంగు సునీల్ డిమాండ్ చేశారు. ఆదివారం భవిత జూనియర్ కళాశాలలో మెట్లు కూలి పలువురు విద్యార్థులకు గాయాలు కావడంపై వారు స్పందిస్తూ.. నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి పర్మిషన్ కూడా లేకుండా నడిపిస్తున్నటువంటి ఎంకే రెడ్డి, భవిత కళాశాలల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.

ఐదేళ్లయినా అందని పరిహారం

- యాదాద్రి ఆలయానికి భూములు ఇచ్చిన సైదాపురం రైతులు
- వేరే చోట భూమి ఇస్తామని చెప్పిన అధికారులు
- ఇప్పటివరకూ పట్టించుకోవడం లేదని ఆవేదన



సైదాపురం పరిధిలో రైతుల వద్ద తీసుకున్న భూములు

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి భూములు ఇచ్చి ఐదేళ్లయినా ఇప్పటివరకు రైతులకు పరిహారం అందలేదు. యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం గ్రామానికి చెందిన రైతుల నుంచి వ్యవసాయ భూములను యాదాద్రి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వాధికారులు తీసుకున్నారు. అయితే తీసుకున్న భూములకు వేరే చోట భూమిని ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. ఐదు సంవత్సరాలు అవుతున్నా తమకు న్యాయం జరగడం లేదంటూ, భూ నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీ మేరకు తమకు వేరే చోట భూములు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

తీసుకున్న భూముల్లో అభివృద్ధి పనులు

సైదాపురం రైతుల నుంచి ప్రభుత్వం తీసుకున్న భూముల్లో పలు అభివృద్ధి పనులకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు, కొంత స్థలాన్ని కేటాయించగా, 100 పడకల ఆస్పత్రి, బస్ డిపో, రోడ్ల విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి మరికొంత స్థలాలను ఇందులో కేటాయించారు.

ఇందిరాగాంధీ హయాంలో పేదలకు ఇచ్చినవి

యాదాద్రి ఆలయం అభివృద్ధికి రైతుల దగ్గర నుంచి తీసుకున్న భూములు, తమకు 50 ఏళ్ల కింద ఇందిరాగాంధీ హయాంలో కేటాయించినట్లు చెబుతున్నారు. ఆ భూములను చదును చేసుకుని, వ్యవసాయం చేసుకుని జీవనాధారం సాగిస్తుంటే, ప్రభుత్వం తమ నుంచి తీసుకుందని రైతులు వాపోతున్నారు. ఈ భూమలపై పాస్‌బుక్ పొంది, రైతుబంధు కూడా పడుతుందని పేర్కొంటున్నారు.

48 మంది రైతుల నుంచి సేకరణ

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధిలో భాగంగా సైదాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 329లో 60 ఎకరాలు, సర్వే నంబర్ 314లో 38 ఎకరాల భూమిని 48 మంది రైతుల నుంచి ప్రభుత్వం 2018లో తీసుకుంది. ఈ భూములు సేకరించేటప్పుడు భూ నిర్వాసితులకు వేరే ప్రాంతంలో భూములు కేటాయిస్తామని అప్పటి రెవెన్యూ అధికారులు తెలియజేశారు. భూములు తీసుకుని 5 సంవత్సరాలు గడుస్తున్నా తమకు మరోచోట భూములను చూపించలేదని, సైదాపురం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం అందలేదు



యాదాద్రి దేవస్థానానికి భూములు ఇవ్వాలని చెప్పి, మాకు ఉన్న ఒక ఎకరం 37 గుంటల భూమిని అధికారులు తీసుకున్నారు. భూములు తీసుకున్నప్పుడు, పరిహారంగా మరొక చోట భూములు ఇస్తామని నచ్చజెప్పారు. కానీ ఇంతవరకు వేరే చోట ఇవ్వలేదు. ప్రజాప్రతినిధులు ఇక్కడ నిర్మాణాలు చేయడానికి శంకుస్థాపనలు చేస్తున్నారు గానీ, కనీసం మమ్మల్ని పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం స్పందించి మాకు న్యాయం చేయాలి. – చంద్రమ్మ, భూ నిర్వాసితురాలు, సైదాపురం

పట్టించుకోవడం లేదు



అప్పుడు భూములు కావాలని తీసుకుని, ఇప్పుడు పరిహారం ఇవ్వమంటే అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ఆలయ అభివృద్ధికి మా వ్యవసాయ భూమి 5 ఎకరాలు తీసుకున్నారు. ఈ భూమికి బదులుగా వేరే ప్రాంతంలో భూమిని కేటాయిస్తామని చెప్పారు. ఇప్పుడు అధికారుల చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా ఫలితం లేదు. – కోరుకొప్పుల కృష్ణస్వామి, భూ నిర్వాసితుడు, సైదాపురం

అధికారులు భూమి తీసుకుని ఐదేళ్లు అయ్యింది



ఒక ఎకరం 30 గుంటల వ్యవసాయ భూమిని తీసుకుని ఐదేళ్లు అయ్యింది. అధికారులు మారుతున్నారే గానీ ఇంతవరకు వేరేచోట భూమి చూపించలేదు. అప్పటి నుంచి తహసీల్దార్ ఆఫీసుకు తిరుగుతున్నాం. ఎన్నిసార్లు తిరిగినా ఇస్తామని అంటున్నారు. కానీ ఇవ్వడం లేదు. మేము ఎలా బతకాలో అర్థం కావడం లేదు. – కన్నాయి జయమ్మ, భూ నిర్వాసితురాలు, సైదాపురం

సేవాలాల్ ఆదర్శప్రాయుడు

దేవరకొండ: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం దేవరకొండలోని బంజారా భవన్‌లో ఆలిండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల్లో దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గుత్తా మాట్లాడుతూ..తెలంగాణ ఏర్పడ్డాక సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని చెప్పారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి సేవాలాల్ మహారాజ్ దేవాలయంలో పూజలు నిర్వహించారు.